ప్రజాశక్తి

శనివారం 27 జులై 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమలకు అనుమతులు

కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-విజయవాడ : సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరరఖాస్తులను పరిశీలించి.. త్వరితగతిన అనుమతుల జారీకి కషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సజన సూచించారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సజన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, జిల్లా పరిశ్రమల అధికారి, మెంబర్ కన్వీనర్ ఎ.సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో 2023, డిసెంబర్ 31 నుంచి 2024, జులై 25 మధ్యకాలంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి ఆదేశాలిచ్చారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 225 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 205 దరఖాస్తులు ఆమోదం పొందాయని, 17 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మిగిలిన వాటిని తిరస్కరించినట్లు తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక సేవల శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీపీ (2015-20), ఐడీపీ (2020-23), బడుగు వికాసం కింద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ టారిఫ్ తదితర రాయితీల కింద మొత్తం 30 యూనిట్లకు దాదాపు రూ. 1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. 2024, జులై 6న జరిగిన స్క్రుటినీ వెరిఫికేషన్ కమిటీ (ఎస్‌వీసీ) సమావేశ నిర్ణయాలను తాజాగా కమిటీ ముందు పెట్టగా.. కమిటీ వివిధ రాయితీలకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయంపై గళమెత్తాలి

ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపు



లెనిన్ సెంటరులో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు సిహెచ్.బాబూరావు, డివి.కృష్ణ, డి.కాశీనాథ్,బి.రమణరావు

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై పోరాడేందుకు రాజకీయాలకతీతంగా అందరూ కలిసిరావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. దేశ ప్రజలను మోసగించిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లను అప్పుగాకుండా గ్రాంటుగా ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని లెనిన్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. విభజన హామీల అమలుకు నిధులు కేటాయించాలని, ఎపికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపి డౌన్ డౌన్ అంటూ సిపిఎం శ్రేణులు నినాదాలు చేశాయి. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై పోరాడి సాధించడానికి టిడిపి ముందుకురావాలన్నారు. విభజన చట్టంలో పేర్కొన్నట్లు రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి, విశాఖస్టీల్ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు, ఇతర అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు కావాల్సిన వేల కోట్ల నిధులను గ్రాంట్ రూపంలో బీహార్ తరహాలో సాధించుకునేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై అన్ని పార్టీలు ఏకమై వత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రోడ్ల నిర్మాణానికి, విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధికి, వరదల సహాయం కోసం బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై పోరాడి రూ.58 వేల కోట్ల మేర నిధులను గ్రాంట్ల రూపంలో సాధించుకున్నారని అన్నారు. కానీ విభజన చట్టంలోని హామీలను సైతం విస్మరించిన కేంద్రంలోని ఎన్‌డిఎ-మోడీ ప్రభుత్వం... అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.15 వేల కోట్లు అప్పు రూపంలో నిధులు ఏర్పాటు చేస్తామని బడ్జెట్లో పేర్కొనడం అత్యంతదారుణమన్నారు. ఇది ఎపి ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇదేదో ఘనకార్యం సాధించినట్లు, రాష్ట్రంపై కేంద్రం వరాలు కురిపించినట్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మిత్రపక్షాలు సంబరాలు జరుపుకోవడం శోచనీయమన్నారు. వారి చేతకాని తనానికి ఇది నిదర్శనమని మండిపడ్డారు. 30 ఏళ్లలో ప్రపంచ బ్యాంక్ అప్పును తీర్చవచ్చని సిఎం చంద్రబాబు చెప్పడం బాధాకరమన్నారు. ప్రపంచ బ్యాంక్ విధించే షరతులకు లోబడి ప్రతిపైసా ప్రజలపై భారాలు మోపి చెల్లించాల్సిన ప్రమాదం ఉటుందన్నారు. విభజన చట్ట ప్రకారం నిధులివ్వాల్సిన బాధ్యత కేంద్రానిదని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఐదేళ్లు గ్రాంట్ (మిగతా 2లో)

పోస్టల్ నెట్‌వర్క్‌తో ఎన్నో ప్రయోజనాలు

ఎగుమతిదారుల సమావేశంలో అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పోస్టల్ నెట్‌వర్క్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పలువురు పోస్టర్ అధికారులు వివరించారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్మాస్టర్ జనరల్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో ఎగుమతిదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకార ఏజెన్సీలుగా డైరెక్టర్ జనరల్ ఫారెన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి), మినిస్ట్రీస్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ), కామర్స్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ (సి అండ్ ఇపి), అసోసియేషన్ ఆఫ్ లేడీస్ ఎంటర్‌ప్రెనేర్స్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఈఎపి) వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిఅండ్ఇపి జాయింట్ డైరెక్టర్ జి.ఎస్ రావు, ఎంఎస్‌ఎంఇ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ బాబు, ఎఫ్ఐఇఒ అసిస్టెంట్ డైరెక్టర్ జి రఘునాథ బాబు పాల్గొని ఎగుమతి విధానాలు, వాణిజ్య సౌలభ్యాన్ని మెరుగుపరచడం, అంతర్జాతీయ వాణిజ్యం కోసం పోస్టల్ నెట్వర్క్ మాధ్యమం ద్వారా ఎలా వినియోగం వినియోగించవచ్చో వివరించారు. ఈసమావేశంలో పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ జగదీష్, విశాఖపట్నం ఎస్ఎస్‌పిఓ గజేంద్ర కుమార్ మీనా, విజయవాడ ఎస్ఎస్‌పిఓ ఎం నరసింహస్వామి డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల ద్వారా తపాల శాఖ అందిస్తున్న అంతర్జాతీయ సేవల గురించి వివరించినారు. ఎగుమతిదారుల సందేహాలను నివృత్తి చేశారు. తపాలా శాఖ డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల ద్వారా ప్రజలు ఎంతో తక్కువ సమయం, రుసుము చెల్లించి విదేశాలకు తమ పార్శిల్‌ను సురక్షితంగా పంపవచ్చని వివరించారు. ఈకార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎగుమతిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



గుమతిదారుల సమావేశంలో పోస్టల్ అధికారులు

నేతల అక్రమ నిర్మాణాలు

నోరుమెదపని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - తిరువూరు : పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన గల సుమారు రూ.10 కోట్ల విలువైన దేవాదాయ శాఖకు చెందిన 38 సెంట్ల స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి భారీ స్థాయిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందింది. ప్రధాన రహదారి కుసుమహార క్లాంత్ షాప్ ఎదుట వాటర్ ట్యాంకుకు వెళ్లే రోడ్డు పక్కన నడిమి తిరువూరు రెవెన్యూ పరిధిలోని అర్‌ఎస్ నెంబర్ 198-1 స్థలంలో వైసిపికి చెందిన 18వ వార్డు మహిళా కౌన్సిలర్ భర్త దారా శ్రీనివాసరావు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణం 60 శాతం వరకూ పూర్తయ్యింది. అదే స్థలంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని కూడా నిర్మిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం... దేవాలయం శాఖకు చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరీ సత్రం స్థలంగా ఉంది. భద్రాచలం వంటి దూర ప్రాంతాల్లోని దేవాలయాల సందర్శనకు ఎద్దుల బండ్లపై వెళ్లి వచ్చే యాత్రికులు విశ్రాంతి తీసుకునేందుకు ఆస్థలంలో సుమారు 70 ఏళ్ల క్రితం పెంకులతో సత్రాన్ని నిర్మించారు. కాలక్రమేనా రవాణా రంగం అభివద్ధి చెందడంతో ఆసత్రం గదుల్లో కొంతమంది చిన్నచిన్న చేతివత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆస్థలం తమ పూర్వీకులదని, కోర్టు కూడా అది తమకే చెందుతుందని తీర్పు ఇచ్చిందని మహిళా కౌన్సిలర్ భర్త శ్రీనివాసరావు తమను ఖాళీచేయించి సత్రాన్ని కూల్చివేయించారని సంబంధిత చేతివత్తిదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వైసిపికే చెందిన తొమ్మిదో వార్డు కౌన్సిలర్ ఎం.దుర్గారావు తమ న్యాయవాది ద్వారా రాష్ట్ర స్థాయి నుండి నగర పంచాయతీ స్థాయి అధికారుల వరకు నోటీసులు పంపామని తెలిపారు. శ్రీనివాసరావు చెబుతున్నట్లు ఆయన పూర్వీకుడైన దారా గురునాధరావుకు ఇనామ్‌దారులు ఆ స్థలంపై ఎలాంటి ఆస్తి హక్కు కల్పించలేదని తెలిపారు. ఆస్థలం దేవాదాయ శాఖ పేరుతోనే జిల్లా రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. తిరువూరు తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేయించి తప్పుడు పత్రాలు సష్టించారని ఆరోపించారు. దీనిపై తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు స్పందిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అనుమతులు లేనందున దానిని నిలిపివేయాలని ఎన్నికలకు ముందు మూడుసార్లు శ్రీనివాసరావుకు నోటీసులు జారీ చేసినా ఏవిధమైన సమాధానం రాలేదన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై కోర్టులో పిటిషన్ వేస్తామని కౌన్సిలర్ దుర్గారావు, నగర పంచాయతీ కమిషనర్ తెలిపారు.



తిరువూరు ప్రధాన రహదారి సమీపంలో నిర్మిస్తున్న కాంప్లెక్స్

అక్రమ నిర్మాణాలపై ఎంఎల్‌ఎ కొలికపూడి వైఖరేంటి ?

ఇటీవల జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు టౌన్ ప్లానింగ్లో జరుగుతున్న అక్రమాల్లో టిడిపి, వైసిపి నేతల పాత్ర ఉందని వ్యాఖ్యానించారు. పట్టణంలో ఓచోట జి ప్లస్ వన్ భవనం నిర్మాణానికి అనుమతి తీసుకుని అక్రమంగా పై అంతస్తులు నిర్మిస్తున్నారని, దీనిలో భాగస్వాములైన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు టిడిపిలో, మరొకరు వైసిపిలో తిరిగారని తెలిపారు. ఇంతలా వ్యాఖ్యానించిన కొలికపూడి ఎంఎల్‌ఎగా గెలిచిన 15 రోజులకే ప్రధాన రహదారి పక్కన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి నేత దారా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో తెలియడంలేదని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

29న ఇపిఎఫ్‌పై నిధి ఆప్కే నికత్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన భవిష్య నిధి పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షన్‌దారులు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో నిధి ఆప్కే నికత్ (ప్రావిడెంట్ ఫండ్ మీ ముంగిట) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భవిష్య నిధి కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా భవిష్య నిధి పథకాలు, సేవలపై వాటాదారులకు పూర్తి అవగాహనా కల్పిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ఈనెల 29న ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్లలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షన్‌దారులు తప్పని సరిగా హాజరై తమ సమస్యలను అధికారులు దష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ గాంధీనగర్లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో, కృష్ణాజిల్లాకు సంబంధించి గుడ్లవల్లేరులోని ఎఎఎన్ఎం అండ్ ఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్యూటీకేర్ అసిస్టెంట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు నైపుణ్యాభివద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బ్యూటీ కేర్ అసిస్టెంట్ శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. నైపుణ్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకుగాను విజయవాడలోని జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యాన 2024-25 సంవత్సరానికిగాను సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.విద్యాకన్నా ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ కార్యాలయ ఆవరణలో ఉచిత శిక్షణ ఇస్తారు. 15 నుండి 45 మధ్య వయస్కులై ఉండి ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డ్ నకలను ఆగస్టు 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం మొగల్రాజపురంలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయం (ఫోన్ నెం: 0866-2470420)లో సంప్రదించవచ్చు.

టిటిడి నిత్యాన్నదానానికి కూరగాయలు అందజేత

దాతలను అభినందించిన మంత్రి అచ్చన్నాయుడు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టిటిడి నిత్యాన్నదాన పథకానికి రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కూరగాయలు పంపారు. ఈ సందర్భంగా నగరంలోని కరెన్సీనగర్ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన వాహనానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు పచ్చ జెండా ఊపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదిమంది మేలు కోసం పనిచేసే ప్రతి ఒక్కరిపై భగవంతుడు అనుగ్రహం ఉంటుందన్నారు. టిటిడి సేవల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని అభిలషించారు. ఇటువంటి సేవలకు సహాయ సహకారం అందిస్తున్న సత్యదేవ వెజిటబుల్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక కార్యక్రమాల నిర్వాహకులు మరడ నాగేంద్ర (నాగు), అయ్యప్ప ట్రావెల్స్ అధినేత చిట్టిబాబు పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మలేరియా, డెంగ్యూ నివారణకు ఫ్రైడే డ్రైడే

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలు మలేరియా, డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ఫ్రైడే డ్రైడేగా పాటిస్తున్నామని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. నగరంలోని 64వ డివిజన్లో శుక్రవారం జరిగిన 'ఫ్రైడే డ్రై డే' అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ జ్వరాల బారిన పడకుండా అవగాహన కల్పించడానికి విఎంసి విస్తృత ప్రచారం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కె.వి.సత్యవతి, చీఫ్



మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, శివరామకష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రామ కోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని పటమటలోగల చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కష్ణా జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ చదువులతో పాటు తమ పిల్లలను క్రీడల దిశగా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ సజన పేర్కొన్నారు. ఉమ్మడి కష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేడీబీఏ) ప్రెసిడెంట్, ఏపీబీఏ కార్యదర్శి, బీఎఐ జాయింట్ సెక్రటరీ డా. పి.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్ క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు స్వర్ణంతో పాటు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో మహిళలు, పురుషుల కేటగిరీలో పోటీలు జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో కేడీబీఏ కార్యదర్శి పరాశ శ్రీనివాస్, కేడీబీఏ వైస్ ప్రెసిడెంట్ ఎన్.మోహన్‌రావు, రిఫరీ టి.కష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం నిషేధంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని కొత్తపేటలో శుక్రవారం పొగాకు ఉత్పత్తుల వాడకం నిషేధం అమలుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యంలో ఎన్‌సిడి-సిడి కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం లీగల్ సెల్ ఆఫీసర్ పుట్టి శివ శంకర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే కేన్సర్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. పొగాకు విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ నాంద్రు హారీష్ ఖాన్ శర్మ, విజయవాడ సెంట్రల్ ఎంఇఒ ఆర్. విజయరామారావు, టీచర్లు బి రాజేష్, నాగరాజు, ఎస్ఐ ఎల్.దేవ సుధ, పోలీసు సిబ్బంది సుదీర్, షేక్ మనుస్, జూనియర్ అసిస్టెంట్ బాల సూర్య పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై గళమెత్తాలి

(మొదటి పేజీ తరువాయి)

రూపంలో నిధులను కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సిఎం వైఎస్ జగన్ భారీ స్థాయిలో అప్పులు చేసి వెళ్లారని చెబుతున్న చంద్రబాబు... రాష్ట్రం మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తే ఎలాగని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కేంద్రం బాధ్యతేనని చెప్పడం తప్ప, దాని కోసం బడ్జెట్లో ఎన్ని నిధులు కేటాయించారో చెప్పలేదన్నారు. విజయవాడ, విశాఖ మెట్రోలైన్ ఊసే లేదన్నారు. అలాగే రాజధాని కేంద్రంగా 45 ప్రభుత్వ రంగ సంస్థల భవనాల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించలేదన్నారు. విశాఖ స్టీల్‌ఫ్యాక్టరీకి గత ఏడాదికన్నా ఈ ఏడాది నిధులు తగ్గించారన్నారు. రాష్ట్ర ప్రత్యేక హోదాను కేంద్రం చెత్త బుట్టలో వేసిందన్నారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ లేదన్నారు. ధరలు పెంచుతూ అన్ని విధాలుగా ప్రజలను మోసంచేయడం తప్ప ఒరిగిందేమీలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాద్ మాట్లాడుతూ ప్రజల అవసరాలు, వారి ఆశలను తుంగలోతొక్కిన కేంద్రంలోని బిజెపికి వ్యతిరేకంగా టిడిపి, జనసేన గళం విప్పాలని కోరారు. లేకపోతే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బోయి సత్యబాబు, జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు, టి ప్రవీణ్, పి కృష్ణ, నాయకులు మురహరి, పి చంద్రశేఖర్, వి గురుమూర్తి, కె రమణ, వై.సుబ్బారావు, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఉపాధి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్వామా పిడి జి వి. సూర్యనారాయణను కలసి వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండు మాసాలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు రాక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, వెంటనే వారికి రావాల్సినటువంటి బకాయిలను చెల్లించాలన్నారు. రోజు రోజుకి పేదల పరిస్థితి దిగజారు తున్న నేపథ్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం రోజుకి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో యాత్రీకరణ పెరగడం వలన పూర్తిగా పని రోజులు తగ్గిపోయాయని కావున ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. పెళ్లి అయిన కుటుంబాలకు కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం లేదని దీని వలన పని దొరకడం లేదన్నారు. కుటుంబానికి సుమారు 30 రోజులు పని మాత్రమే దొరుకుతుందని దీనితో కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. చేసిన పనికి సంబందించిన పే స్లిప్పు ఇవ్వడం లేదని ఎ వారానికి ఆ వారం ప్లే స్లిప్పులు కూలీలకు ఇవ్వాలన్నారు. వ్యవసా యంలో యాత్రీకరణ పెరగడం వలన పూర్తిగా పని రోజులు తగ్గిపోతున్న పరిస్థితిల్లో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వలన నేడు వ్యవసాయంలో దొరికే పని దినాలు మరింతగా తగ్గిపో యాయని వివరించారు. గ్రామపంచాయతీలో చేసుకోవడానికి అను వుగా ఉన్న పనులను గ్రామపంచాయతీ ప్రతిపాదించిన ప్రతి పని కూడా ఆమోదించి పని చేసుకోవటానికి వీలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీర వెంకటేశ్వరరావు, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు, యద్దనపూడి మధు లు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మహిళ ఆత్మహత్య



ప్రజాశక్తి-కోడూరు : వివాహిత మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కోడూరు ఎస్ఐ పి శిరీష తెలిపిన వివరాల మేరకు ఉల్లిపాలెం గ్రామానికి చెందిన మద్దాల సతీష్, భార్య ఇందిరా దేవిలకు ఆరు సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. పుట్టింటికి వెళ్ళవద్దని సతీష్ సతీష్ చెప్పడం వల్ల తన కుమార్తె ఎలుకల మందు తిని చనిపోయిందని మృతురాలు తండ్రి కంబాల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కోడూరు ఎమ్మార్వో టి.శ్రీనివాసరావు పంచనామా చేసిన అనంతరం రమాదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

డ్రైన్లలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం బండారు గూడెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో డ్రైనేజీలు రోడ్లు మరమ్మతులు చేయించాలని ఆందోళనతో అధికారులు స్పందించి డ్రైనేజీ పూడిక పనులను ప్రారంభించారు. డ్రైనేజీల్లో పూడిక తీయించి మురుగునీరు బయటకు పోయే ఏర్పాట్లు చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉన్నచోట ఖాళీ స్థలాల్లో బ్లీచింగ్ సున్నం చల్లిస్తున్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పరిసరాల పరిశుభ్రత లో భాగంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో శానిటేషన్ పనులు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి ఏజేయల్ నరసింహారావు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామంలో అనేకచోట్ల మురుకు నీరు నిల్వ ఉండటంతో వాటిని తొలగించే చర్యలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు పంప్ హౌస్ వద్ద గల ఫిల్టర్ బెడ్ శుభ్రపరచినట్లు తెలిపారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు : కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉచిత ఇసుక విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పాల్గొన్నారు. ఉచిత ఇసుక అమలులో భాగంగా స్టాక్ యార్డులలో అందుబాటులో ఉన్న ఇసుక వివరాలు, రవాణా చార్జీలు, సమస్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గనులు, రవాణ, భూగర్భ జల, ఎన్ఫోర్స్మెంట్, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గనులశాఖ ఇన్చార్జి ఏడి కొండారెడ్డి, సూపరింటెండెంట్ రామకష్ణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎండి.ఎల్. సిద్ధిక్, భూగర్భ జల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

నేడు కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరుగుతుందని జడ్పీ ముఖ్య కార్య నిర్వహణాధికారి తెలియజేశారు.అలాగే మ.12 గంటలకు జెడ్పి స్థాయి సంఘ సమావేశం జరుగు తుందని, సభ్యులందరూ. హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

టిడిపి నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం : తెలుగుదేశం పార్టీ నాయకులపై నమోదు చేసిన కేసును శుక్రవారం గన్నవరం కోర్టు కొట్టివేసింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. గత సంవత్సరం ఫిబ్రవరి 20న గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై అప్పటి సీఎం జగన్ రెడ్డి ఆదేశానుసారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అనుచరులు దాడికి పాల్పడ్డారు. టీడీపీ కార్యాలయ ఆవరణలో ఉన్న కారుకు నిప్పంటించడంతో పాటుగా విచక్షణరహితంగా పలు కార్లను, కార్యాలయంలోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అప్పటి పెనమలూరు మాజీ ఎమ్మెల్యే, జిల్లా ప్రధాన కార్యదర్శి, బోడె ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని వైసీపీ మూకలు చేసిన దాడులను విలేఖరుల సమావేశం ద్వారా జగన్ రెడ్డి అరాచకాలను, వంశీ అనుచరుల దాడులను ఖండించారు. దీనిపై బోడె ప్రసాద్ తో పాటుగా టీడీపీ నాయకులు గరిమెళ్ళ నరేంద్ర చౌదరి, పుట్టా సురేష్, పొట్లూరి వెంకట సుధీర్, పెందుర్తి శ్రీకాంత్, కంచర్ల సూర్యప్రకాష్, యార్లగడ్డ మోహన్ కష్ణా, అట్లూరి శ్రీనివాస్, కొలుసు వరప్రసాద్, మేకల కోటేశ్వరరావు, పిడికిటి సతీష్ బాబు, కుందేటి రఘుబాబులపై గన్నవరం పోలీస్ స్టేషన్లో పోలీసులు కేసును నమోదు చేశారు. అనంతరం 12మందిపై గన్నవరం జ్యూడిషీయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, సాక్షులను కోర్టు విచారించింది. నేరం రుజువుకాకపోవడంతో న్యాయమూర్తి సిహెచ్ శ్రీనివాస్ బాబు కేసును కొట్టి వేస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు.

పాఠశాలలకు కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న ప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రోటరీ క్లబ్ సౌజన్యంతో కిచెన్ గార్డెన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు కూరగాయల విత్తనాలు, పార, పలుగు, కర్ర పార పరికరాలు పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన సభకు పాఠశాల ఇంచార్జ్. ప్రధానో పాధ్యాయురాలు పి రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ టి ఎస్ ఆర్ కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కన్న తల్లిదండ్రులను జన్మభూమిని చదువు చెప్పిన గురువులను ఎన్నటికీ మరువరాదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయురాలు. సరస్వతి పాఠశాల కు రూ. లక్ష విలువగల బ్యాంకు చెక్కును పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జి రవిబాబు, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు డి ఝాన్సీ రాణి, రొటేరియన్ శ్రీకర్, కె మాణిక్యాలరావు. ప్రముఖులు కాసర్ నేను బాబురావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని చిన్న పారు పూడి గ్రామానికి చెందిన మలినేని వినయ్ శుక్రవారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి మతదేహానికి టిడిపి జెండాను కప్పెర అనంతరం రమేష్ చౌదరి మాట్లాడుతూ టిడిపి ఆవిర్భవించిన నాటి నుండి పార్టీలో ఎంతో సేవ చేశారని అన్నారు. వినయ్ మృతి టిడిపికి తీరని లోటు అన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలని ప్రదర్శన

ప్రజాశక్తి-చల్లపల్లి : భారతదేశం నుంచి ఒలింపిక్స్ లో పతకాల కోసం పోటీపడుతున్న 117 మంది అథ్లెట్లు ఘన విజయం సాధించాలని శ్రీ విజయ అకాడమీ ప్రిన్సిపల్ నాగళ్ళ భీమారావు ఆకాంక్షించారు. జాతీయ జెండా చేతబూని విద్యార్థినీ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఒలంపిక్స్ చిహ్నాన్ని ప్రతిబింబించేలా ఐదురంగుల బెలూన్లతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు పి ఈ టి టి.అర్జున్ రావు, ఎం కోటయ్య ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలను చూపుతున్న చిన్నారులు

డాక్టర్ శ్రీహరి హత్యపై సిఐడి దర్యాప్తు : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత నాలుగేళ్ల క్రితం అవనిగడ్డలో సంచలనం సృష్టించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసు విచారణను ప్రభుత్వం సిఐడికి అప్పగించినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ ఎంతో సంచలనాత్మకంగా మారిన ఈ కేసును అప్పట్లో పోలీసులు చేదించలేకపోయారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి సిబిసిఐడి విచారణకు ఆదేశించారన్నారు.



డిజిపిని కలిసిన బుద్ధప్రసాద్

డిజిపిని కలిసిన మండలి బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. అవనిగడ్డలో నాలుగేళ్ల క్రితం జరిగిన డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసును డిజిపి దృష్టికి తీసుకువెళ్లారు. డా. శ్రీహరి సిబిసిఐడి ద్వారా విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో విచారణ వేగవంతం చేయాలని బుద్ధ ప్రసాద్ డిజిపి కి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-గూడూరు : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి మేలైన దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ వనరుల విభాగం సహాయ సంచాలకులు శ్రీనివాస్ అన్నారు.గూడూరు మండలం కంకటావ గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల తో ఈ ఏడాది సుమారు 10 లక్షల ఎకరాలలో సేంద్రియ వ్యవసాయం చేయించాలని తద్వారా రైతులు నాణ్యమైన పంటను పండించి మార్కెట్ లో మంచి ధరను పొంది ఆర్థికంగా బలోపాతం కావాలని మండల వ్యవసాయ అధికారి జి వి శివప్రసాద్ అన్నారు. 14 వారాల పాటు జరిగే పొలంబడి కార్యక్రమం ఈ ఖరీఫ్ లో కంకటావ గ్రామం లో రైతు తోట విష్ణుమూర్తి అనే రైతు పొలం లో జరిగింది. ఈ కార్యక్రమం లో రైతులు పోతురాజు, తాతా వెంకట బసవమ్మ,వాకా శ్రీనివాస్, వెంకట్ మండల విఎఎలు పాల్గొన్నారు.





అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు భూములు సాగుచేసే కౌలు రైతులు అందరికీ కౌలుకార్డులివ్వాలని శుక్రవారం కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం కార్యదర్శి పి ఆనందరావు రైతు సంఘం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు చేయాలని అలానే పంటలు నష్టపోయిన సందర్భాలలో పంట నష్టపరిహారం కూడా అందజేయాలన్నారు. పంటల భీమా రైతు భరోసా పంటి ప్రభుత్వ పథకాలు కూడా కౌలు రైతులకు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు పండించే పంటలను ఈ క్రఫ్ వారి పేరుతో నమోదు అయ్యేల చర్యలు తీసుకోవాలని అన్నారు ధర్నా అనంతరం మీరు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహాసిల్దార్ కు అంద చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యద్శి జెట్టి వెంకటేశ్వర రావు కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు పి.సుందరయ్య కౌలు రైతులు జి.వెంకటేశ్వరరావు, కేవళ్ళ నుకా నాగేశ్వరరావు, కె.జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో చేసిందేమీ లేదు : మాజీ ఎంఎల్‌సి



ప్రజాశక్తి - వత్సవాయి : ఐదేళ్లలో గత ప్రభుత్వం చేసింది ఏమీ లేదని మాజీ శాసన మండలి సభ్యులు టి.దశరథ జనార్ధన్ అన్నారు. మండలం లోని లింగాల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 151 మంది ఉండి రాష్ట్రానికి ఒరిగింది ఏంటని గోదావరి నీళ్లన్నీ కృష్ణా డెల్టా ద్వారా పట్టిసీమకు పంటలు పండించవచ్చని అలాంటి పోలవరాన్ని నిట్ట నిలువున ముంచారని అన్నారు. డయాఫ్రమ్ వాల్ వల్ల తొమ్మిది వందల కోట్లు పెట్టి నిర్మించిన ప్రాజెక్టు మాత్రం ఒక్క అడుగు ముందుకు కూడా వేయలేదని విమర్శించారు. జగన్ చేయలేదని ప్రస్తుతం సిఎం చంద్రబాబు నాయుడు చేశారని అన్నారు. అమరావతి అంటే 15 వేల కోట్లు ఇస్తే అక్కడ అమరావతి అనేది ఉపాధి సంపద కేంద్రమని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాలు ఇతర సంస్థలన్నీ వస్తే అక్కడ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరుకుతాయని అన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన


విస్సన్నపేట బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - విస్సన్నపేట : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను వ్యతి రేకించి శుక్రవారం స్థానిక విస్సన్నపేట బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ భారాలు ప్రజలపై వేస్తూ కార్పొరేట్ వ్యవస్థలను ఉన్నత శిఖరాలపై ఉంచుతూ ఈ పది సంవత్సరాల కాలంలో దేశ ప్రజల్ని మోసం చేస్తూ వచ్చారన్నారు. రూ.15 వేల కోట్లు ఆర్థిక సంస్థల ద్వారా అప్పు ఇప్పిస్తామని చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. విభజన హామీలు ప్రత్యేకహోదా పోలవరం ప్రాజెక్టుకు నిధులు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస నిధులు ఇవ్వకుండా మోసం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు సిపిఎం మండల కమిటీ సభ్యులు పులిబళ్ళ ఏడుకొండలు చిట్టిబాబు యూనియన్ నాయకులు అప్పారావు రాము పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో ఫ్రైడే డ్రైడే



డ్రైడే కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యబాబు, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్స్, తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లో ఫ్రైడే డ్రైడే శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోయి సత్యబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 50వ డివిజన్ పరిధిలోని 177 సచివాలయం మహంతీపురం ప్రాంతాల్లో ప్రజలకు దోమల నివారణకు సహకారం అందించి, ప్రజారోగ్యం కోసం, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.కాలి స్థలాలు పూల కుండీలు ఖాళీ డబ్బాలు వాటర్ డ్రమ్ములు తదితర పాత వస్తువులో నీరు నిల్వ లేకుండా చేయ్యాలి. అని ఇంటి ఇంటి కరపత్రాలు పంపిణీ అవగాహన కల్పించారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, శానీటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిశంకర్, సచివాలయం సేక్రేటరీలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్స్, ఆర్‌పిలు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం


మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి పాకిస్థాన్‌పై విజయం సాధించడంలో అసువులు బాసిన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని వారిని స్ఫూర్తిగా తీసుకుని దేశ రక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాల్సి ఉందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి డా.కె.కళ్యాణవీణ తెలిపారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో రిట్కెర్డ్ సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి డా.కె. కళ్యాణ వీణ మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దొడ్డిదారిన భారత భూభాగాన్ని అక్రమించుకోవాలని చూసిన పాక్ సైనికులకు మన సైనికులు "అపరేషన్ విజయ్" పేరిట భారత ప్రతాపాన్ని రుచి చూపించారన్నారు. కార్గిల్ విజయాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏడాది జూల్కై 26వ తేదీన కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో సేవలు అందించిన మాజీ సైనికులు సుబేదార్ మేజర్, కె.రామకష్ణారావు నాయబ్ సుబేదార్లు జి.శివనాగేశ్వరరావు డి.శ్రీకృష్ణ ప్రసాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ సిహెచ్.సత్యశ్రీనివాస్ హవిల్దార్ జి.వెంకటేశ్వరరావు కె.శ్రీధర్ సార్జెంట్ జి.ఎన్.వి.వి.ప్రసాద్ సిహెచ్.శివ పరమేశ్వరరావు నాయక్ ఉమామహేశ్వరరావు ఆల్ఫ్రడ్ వాసపోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు


కమిషనర్‌కు పుష్పగుచ్చం ఇస్తున్న కాశీనాథ్, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ నూతన కమిషనర్ ధ్యానచంద్రను మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కమిషనర్‌కు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలపై వివరించడానికి సమయం కేటాయించాలని నేతలు కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ...రెండు, మూడు రోజుల్లోనే సమయం కేటాయించి, కార్మికుల సమస్యలను తెలుసుకుంటానని నేతలకు కమిషనర్ హామీనిచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్, సిటీ ఆర్గనైజర్ టి.ప్రవీణ్, నాయకులు జలసూత్రం వీరబాబు, గుర్రం కరిముల్లా, ఎం.నరసింహారావు, బత్తుల రవి, టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మీ, ఎం.బుజ్జమ్మ, బి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : సిఐటియు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కంకర క్వారీలో భద్రతా చర్యలు చేపట్టి వాటిలో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు పిఎఫ్, ఇఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కంకర క్వారీల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల సరైన భద్రత చర్యలు తీసుకోకపోవటం వల్ల కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గనుల శాఖ రెవెన్యూ లేబర్ డిపార్ట్మెంట్ తక్షణమే క్వారీలో జరుగుతున్న ప్రమాదాలపై భద్రతపై తనిఖీలు నిర్వహించి కార్మికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై స్పందించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని క్వారీ కార్మికులకు అండగా సిఐటియు ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయాలి : ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : జిల్లాలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాల యాలు, కస్తూరిబాయి విద్యాలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి విద్యావ్యవస్థను ముందుకు తీసుకువెళ్లాలని ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. రెడ్డిగూడెం మండలం, రంగాపురం పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఈ బృందం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలకు, రెసిడెన్షియల్ విద్యాల యాల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయించి పాఠశాల లను - కళాశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. సొసైటీల పరిధిలో ఉన్న పాఠశాలలు - కళాశాలలో సీట్లు పెంచాలని, ముఖ్యంగా ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు సీట్లు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రత్యేకంగా వారు అభినందించారు.

దుర్గమ్మకు 31 గ్రాముల బంగారు కాయిన్ విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయానికి శుక్రవారం యూసఫ్ గూడ, హైదరాబాద్‌కు చెందిన కొమ్మరాజు శివరామకృష్ణ, కుటుంబసభ్యులు అమ్మవారికి ఆలయానికి కానుకగా 31 గ్రాములు బరువు గల బంగారు కాయిన్‌ను ఆలయ అధికారులను కలిసి దేవస్థానానికి అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదంలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - భవానీపురం : పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం 45వ డివిజన్‌లోని రాము క్వారీలో నిర్వహించారు. సచివాలయం స్పెషల్ ఆఫీసర్ చంద్రబోస్, 45 డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరావు, శానిటరీ మేస్త్రి రామిరెడ్డి, సచివాలయం సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ స్థానికులకు ఫ్రైడే డ్రైడే ఆవశ్యకతను వివరించారు. వర్షా కాలంలో సీజనల్ గా వచ్చే మలేరియా, డయే రియా, కలరా, చికెన్ గున్యా తదితర వ్యాధులు నుండి సురక్షితంగా ఉండాలంటే రోడ్లు, వీధులు, మురుగు నీటి కాలువలలో చెత్తను వేయొద్దని చెప్పారు. సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ సిబ్బంది, డివిజన్లోని పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని ప్యాకర్స్ అండ్ మూవర్స్ వినతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ది విజయవాడ గుంటూరు ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీకే ప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీ రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డిని శుక్రవారం పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవానీపురానికి చెందిన కెడిఎల్ఒఎ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.వి.సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో శిక్షా సప్తాహ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 5వ రోజైన శుక్రవారం నైపుణ్య దినోత్సవాన్ని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో కలిసి జరిపించారు. ఈ స్కూల్ లో నూతనంగా వచ్చిన ఐ.టి. ఉపాధ్యాయురాలు నాగసాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దానిలో ప్రత్యేకంగా విద్యార్థికి అవసరమైన కంప్యూటర్ ఆధారిత నైపుణ్య అభివృద్ధిని అందించడం శుభపరిణామం అని హెచ్.ఎమ్.పద్మలత చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : అంగన్వాడి కేంద్రాలు సరిగా నిర్వహించా లని, గర్భవతులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు.గూడూరు మండలం లో పటాన్‌పేట, జమ్మి రామరాజుపాలెం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా చిన్నారుల హాజరు పట్టి పరిశీలించారు, పిల్లల బరువు, ఎత్తు నమోదు రిజిస్టర్ పరిశీలించి ఒకరిద్దరి చిన్నారుల బరువు స్వయంగా పరిశీలించారు. మెనూలో చిన్నారులకు అన్నం, ఉడికించిన గుడ్డు, ఆకుకూర పప్పు అందించారు. పాలు, గుడ్లు వంటి ఆహార పదార్థాల స్టాక్ రిజిస్టర్ తనికి చేశారు. పిల్లలలో శారీరిక ఎదుగుదలకు పిల్లల బరువు ఎత్తు వ్యాక్సినేషన్ నమోదు రిజిస్టర్లు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పటాన్ పేట, రామరాజుపాలెం అంగన్వాడి కేంద్రాల పరిధిలో గర్భవతులు, బాలింతల గృహాలను కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించి వారికి పాలు, గుడ్లు, ఖర్జూర, నూనె, బియ్యం, పప్పు సక్రమంగా ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. రామరాజు పాలెం కేంద్రంలో గర్భవతుల బాలింతల గృహ సందర్శన రిజిస్టర్ లేకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో రిజిస్టర్లు సరిగా నిర్వహించాలని అన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జమ్మిరామరాజుపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. మెనూలో అన్నం, గోంగూర-పప్పు, చిక్కి, ఉడికించిన గుడ్డు విద్యార్థులకు అందించారు. రెండవ తరగతి విద్యార్థి అభయ్ తేజతో చిన్న చిన్న కూడికలు ఇచ్చి చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కొక్క విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రాథమిక విద్యలోనే బలమైన పునాది వేయాలని, తద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఐసిడిఎస్ పిడి ఎస్. సువర్ణ, సిడిపిఓ గ్లోరీ, సూపర్వైజర్లు ఉష్శశ్రీ, రేవతి, ఉప విద్యాశాఖ అధికారి శేఖర్ సింగ్, తాసిల్దార్ శాంతి ఉన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు

గూడూరు మండలం పటాన్ పేట, రామ రాజుపాలెం అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రికార్డులు సరిగా నిర్వహించని కారణంగా ఆయా కేంద్రాల అంగన్వాడి కార్యకర్తలకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు.

అల్లాపురంలో పోలీసుల గాలింపు

● ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం అల్లాపురం గ్రామంలో 'తెలంగాణ మందు విచ్చలవిడిగా అమ్ముతున్నారు' అన్న శీర్షికతో వచ్చిన వార్తకు పోలీసులు స్పందించారు. శుక్రవారం గ్రామంలో జల్లెడ పట్టారు. అయితే మందు విక్రయదారులు ముందుగానే జాగ్రత్తపడి మాయమైపోయారు. మందు అల్లాపురం పరిసర గ్రామాల్లో దాచి పెట్టారని గ్రామస్తులు చెబుతున్నారు. గడ్డివాములు, ముళ్లపదలు, పాడుబడిన ఇల్లు, మరుగుదొడ్లు, తుప్పల్లో దాచారని అంటున్నారు. పోలీసులు దీనిపై డేగ కన్ను వేస్తే గాని అక్రమ అమకాలు ఆగవని గ్రామానికి చెందిన మహిళలు చెబుతున్నారు. బుద్ధవరంలో ఇద్దరు, మర్లపాలెం లో ఇద్దరూ, చిన్న అవుటపల్లి లో ఇద్దరూ అక్రమ మద్యం పాయింట్లు పెట్టి అమ్ముతున్నారని స్థానికులు తెలిపారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

ప్రజాశక్తి-పెడన : ఉన్నంతలోనే పేదలకు అన్నదానం చేయడంలో ఎంతో సంతోషం ఉందంటూ యర్ర మల్లికార్జునరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రామలక్ష్మి కాలనీలోని అమ్మ ఫుడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు యర్ర మల్లికార్జునరావు, చౌడేశ్వరి దంపతులు పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా అమ్మ ఫుడ్ ఫౌండేషన్ ద్వారా వేలాదిమంది వద్ధుల, వికలాంగుల, వితంతువులకు అన్నదాన కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. కేవలం ట్రస్ట్ నుంచి కాకుండా పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని దాతలు సహకారంతో ఈ ట్రస్ట్ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా స్థిరపడిన వారు తమ ట్రస్ట్ కు విరాళాలు ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరారు.

నోట్‌పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో పల్లపోతు వెంకటనాగబాబు కుమార్తె జ్యోత్స్నశ్రీ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. శుక్రవారం స్థానిక ఎస్.పి.ఎస్ హైస్కూల్, కళాశాల ఫస్ట్, సెకండ్ ఇంటర్ విద్యార్థినిలకు నోట్ పుస్తకాలు స్టేషనరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ నిమ్మగడ్డ రమాదేవి, మండల అగ్రికల్చర్ అధికారిణి బి అనంతలక్ష్మి, సయ్యద్ గఫార్, బొగ్గరపు తిరుపతయ్య, తోట రాజు, దొండపాటి అర్జున్, జాజుల తాతారావు, కుంభం నాగమణి, కంతేటి హరిబాబు, పాఠశాల హెచ్ఎం రాణి, పిటి మడకా ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరుకు మాజీ సిఎం జగన్



ప్రజాశక్తి.-గన్నవరం : తాడేపల్లి నివాసం నుండి రోడ్డు మార్గాన గన్నవరం విమానాశ్రయానికి సతీసమేతంగా మాజీ సీఎం జగన్ శుక్రవారం చేరుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో జై జగన్ జై, జై జగన్ సీఎం జగన్ జై జగన్ అని కార్యకర్తల నినాదాలు చేశారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుండి ఇండిగో విమానంలో బెంగళూరుకి బయలుదేరి వెళ్లారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మడ అడవుల దినోత్సవం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవంను పురస్కరించుకొని కృష్ణాజిల్లా అటవీ అధికారి కె. రాజశేఖరరావు ఆధ్వర్యంలో మచిలీపట్నం నగరపాలక ఉన్నత పాఠశాల గిలకలదిండిలో విద్యా ర్థులకు మడ అడవుల ప్రాముఖ్యత, వాటిని సంరక్షణ గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మడ అడవుల ఆవశ్యకత గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అటవీ క్షేత్రాధికారులు సుజాత, షరీఫ్, వెంకటేశ్వరరావు నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి లోకేష్ అండ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం వియన్ పురం కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త లావు వంశీ శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తన తమ్ముడి ఆరోగ్య పరిస్థితిని చెప్పి సహాయం చేయాలని కోరారు. తన సోదరుడు కిషోర్ అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడని మంత్రికి చెప్పారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేష్ వ్యక్తిగత కార్యదర్శితో హాస్పిటల్ కు ఫోన్ చేయించారు. కిషోర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. మంత్రి లోకేష్ స్పందనతో వంశీ ధన్యవాదాలు తెలిపాడు.



మంత్రి లోకేష్ కు సమస్య చెబుతున్న వంశీ

30న చెస్ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 వ తేదీ ఉదయం 9గంటలకు పాఠశాల బాల, బాలికలకు మండల స్థాయి చెస్ పోటీలు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు పోటీల కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు కే.వి.ఆర్. కిషోర్, ధనియాల నాగరాజు గురువారం తెలిపారు.పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పోటీలను హెచ్. సి.యల్ మరియు హిల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సౌజన్యం తో జరుగుతున్నట్లు సమన్వయకర్త బి. సత్యనారాయణ రావు తెలిపారు. ఆసక్తి కలిగిన బాల,బాలికలుతమ చెస్ బోర్డుల తో హాజరు కావాలని ఆయన తెలిపారు.వివరాలకు 9490798909 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని సత్యనారాయణ రావు కోరారు.

శాకంబరీగా దర్శనం



ప్రజాశక్తి-పెడన : పెడన పట్టణంలో శ్రీ పైడమ్మ అమ్మ వారి ఆలయంలో శుక్రవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. మూడు రోజులపాటు జరగనున్న ఉత్స వాల్లో అమ్మవారు శాకంబరి దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈవో తిక్కిశెట్టి రామ్మోహన్రావు పేర్కొన్నారు. శని ఆదివారాలలో కూడా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు,పండ్లతో అమ్మవారికి ఎంతో భక్తి శ్రద్ధలతో అలంకరణ చేయనున్నట్లు రామ్మోహన్రావు చెప్పారు.. అమ్మవారి మూల విరాట్ తో పాటు ఆలయంలోని దేవతామూర్తులకు, ఆలయ ప్రాంగణమంతా వివిధ కూరగాయలతో అలంకరణ చేస్తారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో శాకంబరి దేవి ఉత్సవాలు జరగడం వంశపారపర్యంగా వస్తుందన్నారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త దాసు వాయి నందన్ రావు, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలో ఆషాడమాసోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆషాడ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని దేవాలయాల్లో ఆషాడ మాసోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అమ్మవారికి సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ : జడ్జి

ప్రజాశక్తి-పెడన : ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని జిల్లా సివిల్ జడ్జి కెవి రామకష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్నంలోని శ్రీ విజయనంద డిగ్రీ కళాశాల నుండి పెడన బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నిర్వహణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా టూవీలర్‌పై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకో వాలన్నారు.హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలయ్యి ప్రాణాలు కోల్పో తున్నారని, అందుకే కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వాహనదా రులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రావి రాంబాబు, ఆర్ఐ మణికుమార్, విజయనంద కళాశాలల ప్రిన్సిపాల్ ఏ నాగమల్లేశ్వరరావు, కళాశాల డైరెక్టర్లు ఉమ్మిటి విద్యాధరరావు, ఎం శ్రీనివాసరావు నాగేశ్వరరావు, కళాశాల కార్యదర్శి కే జ్యోతి రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో కూచిపూడి ఎస్ఐ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో హెల్మెట్ ఉపయోగాలపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోతే వేయి రూపాయలు జరిమానా, మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదం బారిన పడకుండా తమను తాము కాపాడుకోవాలని ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్‌కెవి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హెల్మెట్ రక్షణపై వాహన దారులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా కళాశాల నుండి పొట్టి పాడు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీహరి బాబు, ఎన్ బాను విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణ



ఉంగుటూరు మండలం ఉషారామ కళాశాలలో...

భారీ గాలులకు విరిగిన చెట్టు

ప్రజాశక్తి-గన్నవరం : శుక్రవారం వీచిన భారీ గాలులకు గన్నవరం గ్రామ పంచాయతీ వెనుక సబ్ రిజిస్టార్ ఆఫీస్ కు వెళ్లే రోడ్డులో చెట్టు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు వెళ్లే మార్గం లేక వేరొక రూట్‌లో జనాలు వెళ్లిపోయారు. పడిపోయిన చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు .



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా డిహెచ్‌ఎంఓ డాక్టర్ సుహాసిని, డీఎంవో డాక్టర్ మోతిబాబు ఆధ్వర్యంలో ఎర్ర కాలవ కట్ట ఏరియాలో పర్యటించారు ఈ సందర్భంగా నిల్వ ఉన్న నీటిలో లార్వాలను చూపించి ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రజలకు పలు సూచనలు చేశారు అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పటల్ సందర్శించి రోగులను పరీక్షించారు ముఖ్యంగా జ్వరంతో హాస్పిటల్లో చేరిన అనుమంచిపల్లి గ్రామానికి చెందిన కొట్టే చైతన్యను పలకరించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు డాక్టర్ శైలజ డాక్టర్ అనిల్ కుమార్ డాక్టర్ హరీష్ మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ జానకి రామ్

సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జానకి రామ్ మాట్లా డుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించకూడదని, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 అందరూ తెలుసుకోవాలని ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉపయోగించే వారు తెలియని లింక్స్ ఓపెన్ చేయకూడదని ఆధార్ నంబర్ దానికి సంబంధించిన ఓటిపి నంబర్స్ ఎవరకి చెప్పకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎస్ఐ రాంబాబు పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్స్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - గంపలగూడెం : రెండేళ్లుగా వేతనాలివ్వడం లేదని పారిశుధ్య కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని ఊటుకూరు గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలివ్వకపోవడంతో వీధిన పడ్డారు. రెండు నెలలుగా విధులకు రానివ్వకుండా వేరొకరిని పెట్టుకుని పని చేయించుకుంటున్నట్లు వివరించారు. రోజువారి కూలి చేసుకుని పొట్ట పోసుకునే తమకు 20 నెలలు డబ్బులు ఇవ్వకపోతే ఎలా బత కాలని ప్రశ్నించారు. ఇప్పటికే లక్షల్లో సొమ్ము రావాల్సి ఉండగా, దానికి తోడు రెండు నెలలుగా పని లేక పోవడం కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన చెందారు. ఎప్పటికైనా తమ గోడును ఉన్నతాధికారులు ఆలకించి, వెంటనే వేతనాలు చెల్లింపు చేసి ఆదుకోవాలని కోరారు.



విత్తనోత్పత్తిపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బండిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం, ప్రకృతి వ్యవసాయంపై జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సత్యావతి మాట్లాడుతూ ఈ పథకం కింద మూడుసార్లు శిక్షణ తరగతులు ఉంటాయని, మొదటి శిక్షణ తరగతుల్లో భాగంగా రైతులకు విత్తన శుద్ధి చేసుకుని వాడటం వల్ల ఉపయోగం ఉంటుందని తెలిపారు. నారుమడుల్లో పాటించవలసిన సస్యరక్షణ పద్ధతులు అవలంబించడం వల్ల ప్రధాన పొలంలో కలిగే లాభాలను తెలిపారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం మంచి విత్తనానికి ఉండవలసిన నాణ్యత ప్రమాణాలు స్వచ్ఛతను బట్టి విత్తన తరాల గురించి, విత్తన తయారీలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నాణ్యమైన విత్తనం తయారీలో సేంద్రీయ ఎరువుల వాడకంపై ప్రాముఖ్యతను వివరించారు. జగ్గయ్యపేట ఎడిఎ భవాని మాట్లాడుతూ పచ్చిరొట్టి పంటలు వేయటం వల్ల ఉపయోగాలు తెలిపారు. అనంతరం పచ్చ రొట్టె వేసిన పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు భవాని, మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి, గ్రామ వ్యవసాయ అధికారి వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

స్టాక్ యాడ్‌లో అనధికారికంగా విధులను నిర్వహిస్తున్న ప్రైవేటు వ్యక్తిని గుర్తింపు, అవకతవకలు పాల్పడుతున్నాడని అదుపులోకి తీసుకొని పోలీసు వారికి అప్పగింత ఇసుక స్టాక్ యాడ్‌లో అక్రమాలు బట్టబయలు చేసిన ఎస్సీబీ ఇన్‌స్పెక్టర్ మణికంఠ రెడ్డి మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో గల ఇసుక స్టాక్‌యాడ్‌లో ప్రభుత్వం ఆదేశించిన నియమ నిబంధనల ప్రకారం సాధారణంగా ఇసుక కావలసిన వినియోగదారులు స్టాక్‌యార్డ్ వద్దకు వచ్చి అక్కడ మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన స్వైపింగ్ మిషన్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ప్రభుతానికి గదును చెల్లించి ఇసుకను పొందవలసి ఉంటుంది. కానీ ప్రైవేటు వ్యక్తి ఇసుక వినియోగదారుల నుంచి ఫోన్ పే ద్వారా తన వ్యక్తిగత అకౌంట్‌కి సొమ్ములను స్వీకరించి, తరువాత వాటిని ప్రభుత్వ ఖాతాకు చెల్లించి రసీదు ఇచ్చే క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ చేశారు. గురువారం ఉదయం నుండి రాత్రి వరకు ఆ వ్యక్తి రూ.25,350 లు ఇసుక వినియోగదారుల నుండి వ్యక్తిగత ఖాతాకు ఫోన్‌పే ద్వారా పొందాడు. కానీ తిరిగి ప్రభుత్వ ఖాతాకు చెల్లించే క్రమంలో 21,750 రూపాయల మాత్రమే చెల్లించాడు. జగ్గయ్యపేటకు చెందిన పవన్ నుండి రూ.15వేలు వ్యక్తిగత ఖాతాకు పొందడమే కాకుండా, అతనికి గురువారం ఒక్కరోజే 50 టన్నుల ఇసుకను మంజూరు చేసేలా ట్రాన్సాక్షన్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రోజుకి 20 టన్నులకు మాత్రమే మంజూరు చేయాలి. కానీ ఇతను 50 టన్నుల ఇసుకను పవన్‌కు మంజూరు చేయటానికి ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో ఇతనితో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు ఒక్కొక్క ట్రాక్టర్‌కు 5 టన్నుల చొప్పున ఇసుకను లోడ్ చేయించుకుని స్టాక్ యాడ్‌లో ఎగ్జిట్ పాయింట్ వద్దకు వచ్చారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎస్‌సిబి సిబ్బంది సరైన పత్రాలు, నగదు రసీదును లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేయించుకోవటం, ఎగ్జిట్ పాయింట్ వరకు రావడం చట్టప్రకారం నేరంగా గుర్తించి సదరు రెండు ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులో తీసుకొని, రెండు ట్రాక్టర్లు, అందులోని పది టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇసుక స్టాక్ పాయింట్‌లో అనధికారికంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రాన్సాక్షన్స్ చేస్తున్న షేక్ సైదా అనే ప్రైవేటు వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, వస్తువులను చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ మణికంఠ రెడ్డి తెలిపారు.


తనిఖీల్లో భాగంగా ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

జంతువుల సంచారంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలో కుక్కలు, పందులు, కోతులు, ఆవుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి నివారణకు తగుచర్యలు తీసుకోవా లని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజుకు జనసేన నాయకులు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ జంతువుల వల్ల ముఖ్యంగా స్కూలుకెళ్లే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రహదారులకు అడ్డుగా ఉంటున్న ఈ జంతువుల వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించాలని జనసేన నాయకులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉయ్యూరు జయ ప్రకాష్, పసుపులేటి నరేష్ మిత్రా, లింగినేని సుధాకర్, పసుపులేటి రవీంద్ర, రామిశెట్టి జగన్, బత్తుల వెంకటేశ్వరరావు, వెల్ ఫిట్ సత్యనారాయణ, బెల్లంకొం డ సుధీర్, ఉయ్యూరు శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి - తిరువూరు : డెమోక్రటిక్ పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీను ఆధ్వర్యంలో మండలంలోని గానుగపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మిని సన్మానించారు. టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం తిరువూరు వచ్చిన ఆయన గత 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఆదిలక్ష్మిని సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టియు నాయకులు బి.జమలయ్య, పివిరావు, శీలం రామారావు, ఎస్ లక్ష్మణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : మండలంలోని లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి శ్యాంసుందరరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఐదు రోజులుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షా సప్తా హ్ కార్యక్రమాలను అయన పరిశీలించారు. స్కిల్ డే లో భాగంగా విద్యార్థులు మట్టితో, తాటాకులు, ఆకులు, పువ్వులతో చేసిన వివిధ నమూనాలను తిలకించిన ఆయన విద్యార్థులను విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రకృతి, వ్యవసాయం నుండి నేర్చుకోవటం ప్రతి విద్యార్థి లక్ష్యమని పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుల మార్కపూడి జయశ్రీ అన్నారు మండలంలోని చిన్న మోదుగు పల్లి గ్రామంలో ఎంపిపి పాఠశాలలో శుక్రవారం సాంకేతిక నైపుణ్యల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో వివరణ నైపుణ్యాల ప్రదర్శన చూపించడం కోసం పొలాలకు వెళ్లి విద్యార్థులతో మొక్కలు నాటే విధానం, ఎదుగుదల గురించి కలుపు తీయించటం వివరించారు.

హిస్టరీ పోస్టు భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంఎ హిస్టరీ గెస్ట్ లెక్చరర్ పోస్టును భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుశీలరావు పేర్కొన్నారు. ఎంఎ హిస్టరీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని చెప్పారు. ఎంఎ హిస్టరీతో పాటు నెట్, ఏపీ సెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు ఆగస్టు ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఆగస్టు మూడో తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై పోలీసులు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ అబ్దుల్ నబీ మాట్లాడుతూ నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులను తీవ్ర క్షోభకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి అటువంటి వాటికి దూరంగా ఉంటూ మంచి నడవడ కని అలవర్చుకొని ఉన్నత వంతులుగా ఎదగాలని సిఐ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, ఎస్ఐ సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - తిరువూరు : వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు సూచించారు. పట్టణంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ, నగర పంచాయతీ సంయుక్తంగా డ్రై డే నిర్వహించారు. వార్డుల్లో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ నివాసగృహాల నడుమ పందుల పెంపకం, మురుగునీరు నిల్వ ఉండటంపై తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. దోమల నిర్మూలనకు నివాసగృహాలల్లో రోజుల తరబడి నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య అధికారిని రేష్మా బేగం ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యదర్శులు వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. మాంసాహారానికి బదులు సాత్వికాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ కె.రవి, హెల్త్ విజిటర్ ఆషాబి పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మైలవరం : మండల పరిషత్ అభివృద్ధి అధికారి నేతృత్వంలో స్థానిక పంచాయతీ సహకారంతో ఆయా కార్యాలయాల సిబ్బంది, కార్మికులు, పారిశుధ్య పనివారికి, రైతులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అయ్యాన్ ఐ.హాస్పిటల్ గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. డాక్టర్ బషీర్ అహ్మద్ మయూకు ఈ శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహిస్తారు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దుర్గగుడి స్వర్ణతాపడ పనులకు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి ఆలయ స్వర్ణతాపడ పనుల నిమిత్తం విస్సా కోడూరు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దాత మీసాల రేణుకా స్వాతి 1000 సింగపూర్ డాలర్లను విరాళంగా ఆలయ అధికారులను శుక్రవారం కలిసి దేవస్థానానికి అందజేశారు. దాతకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.



నిస్సహాయ స్థితిలో వ్యక్తి : ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ తాటాకుల వారి వీధిలో శుక్రవారం ఒక వ్యక్తి నిస్సహాయ స్థితిలో రోడ్డుపై పడి ఉన్నాడు. దీంతో స్థానికులు 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)కి సమాచార మిచ్చారు. ఆ వ్యక్తిని కార్పొరేటర్ చంటి 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టు టౌన్ కానిస్టేబుల్ వినయ్ ఉన్నారు.

వస్త్రాలు బహూకరణ

ప్రజాశక్తి - మైలవరం : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం జోన్ చైర్మన్ జాస్తి వెంకటేశ్వరరావు కుమార్తె జాస్తి మోనిషా పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక నారాయణ పాఠశాలలోని సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, ముందు ముందు కూడా ఆ సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మైలవరం అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీధర్, సెక్రటరీ చనుమోలు నాగభూషణం, ట్రెజరర్ కొల్లిపర నాగ ప్రసాద్, లయన్స్ సభ్యులు తాడేపల్లి వెంకటేశ్వరరావు, లేళ్ళ ఏడుకొండలు, చలువాది హరీష్ కుమార్ గుప్తా, పులిపాటి శ్రీను పాల్గొన్నారు.



కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



బందరులో జవాన్లను సత్కరిస్తున్న దృశ్యం



బంటుమిల్లి ప్రభుత్వ కళాశాలలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో శుక్రవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 1999లో 80 రోజులపాటు పాకిస్తాన్తో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశం పక్షాన పోరాడి 527 మంది సైనికులు వీర మరణం పొందిన నేపథ్యంలో నాటి యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్ల త్యాగాలు స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అమర జవాన్లకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బండే రాఘవ, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, అడపా శ్రీనివాసరావు, ఘంటసాల రాజమోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు సత్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీలో కార్గిల్ యుద్ధంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన తెలుగుతేజాలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపకులపతి అర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శోభన్ బాబు, బీసీ సెల్ రాష్ట్ర కొనకళ్ళ బుల్లయ్య ,జనసేన మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకష్ణ, యువ మోర్చా కష్ణాజిల్లా అధ్యక్షులు నాగలింగం అయోధ్య రామచంద్రరావు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పంతం గజేంద్ర, ఘంటా సతీష్, గడ్డం రాజు, నాయకులు పత్తిపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బంటుమిల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్మోహన రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో 25 సంవత్సరాల క్రితం కార్గిల్ పోరాట ఉద్యమంలో జరిగిన సంగతులు ఉన్నది ఉన్నట్లుగా విద్యార్థులు చేసి చూపించారు. దేశం యావత్తు కూడా ఈ విజయ ఉత్సవాన్ని వేడుకగా ఆచరిస్తున్న సందర్భంలో త్యాగాన్ని, ప్రేమను, దేశభక్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. అధ్యాపకులు బి.దేవ జయరాజు, డాక్టర్ జి. బి. ఆనంద కుమార్, ఆర్ హిమాలినీ దేవి, జహీదాబేగం డాక్టర్ సత్యారాజేష్, జ్యోత్స్న, చలం ప్రసాద్ తో పాటు పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం కార్గిల్ పోరాటంలో అశువులు బాసిన వీర జవాన్లకు నివాళు లర్పించారు.

ఢిల్లీలో ఇపిఎస్ పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయండి

- ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.శాస్త్రి పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కేంద్రంలోని ఎన్‌డిఎ-మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇపిఎస్-95 పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.శాస్త్రి పేర్కొన్నారు. బడ్జెట్‌తో ఎంతో కొంత ఊరట లభిస్తుందనుకొన్న పెన్షనర్లకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. రూ.1000 పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పుడు సామాజిక పెన్షన్లే రూ.4 వేల వరకు ఇస్తారని తెలిపారు. ఈ విధానాలను నిరసిస్తూ ఇపిఎస్-95 పెన్షనర్లకు భత్యంతో కూడిన కనీస పెన్షన్ కరువు రూ.9 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6, 7, 8 తేదీల్లో మూడు రోజులపాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన, ధర్నాలకు ఆల్ ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

104 వైద్య సేవలు

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : మండలంలోని పోలిమెట్ల గ్రామంలో 104 క్యాంపుని శుక్రవారం నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ మనం యశస్విని 72 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు అంటూ వ్యాధులు ప్రబలకుండా, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ యశస్విని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తాతినేని వెంకటాద్రి, రమేష్, ఏఎన్ఎం శ్రావణి, ఎం ఎల్ హెచ్ పి జోస్నారాణి ఆశా వర్కర్స్ మల్లీశ్వరి యశోద రాణి ఏసమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి-కంకిపాడు : కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం శుక్రవారం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రంగారావు మాట్లాడుతూ బడ్జెట్లో రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలను మల్టీ లిటరల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ద్వారా ఇస్తామని చెప్పారని, ఎక్కడా కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రాంట్ ఇస్తామని అనకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే విభజన హామీల గురించి గానీ ప్రత్యేక హోదా గురించి గానీ ఊసే లేకపోవటం బిజెపి రాష్ట్రానికి చేస్తున్న తీరని అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, సిపిఎంకంకిపాడు మండలం కమిటీ సభ్యులు ఎం. చంటిబాబు,, పి. దుర్గారావు, జి.కుమారి, వి. జాన్ మోజేష్, రవి, శివ శంకర్, పార్టీ సభ్యులు రమేష్, నాంచారయ్య, వెంకట బాబు, దివ్య ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతులపట్ల చిన్నచూపు తగదు : రైతుసంఘం



విలేకరులతో మాట్లాడుతున్న గౌరిశెట్టి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుడివాడ : బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 1.52 లక్షల కోట్లు కేటాయించి రైతులను చిన్న చూపు చూశారని, ఇది చాలా దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శు క్రవారం గుడివాడ సుందరయ్య భవనంలో విలేకరుల సమావశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రం అభివద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా అనేది చాలా అవసరమన్నారు. వ్యవసాయ రంగానికి కూడా పోలవరం చాలా ఉపయోగమని, యుద్ధ ప్రాతిపదికన ఎక్కువ నిధులు కేటాయించి 2025 నాటికి పూర్తిస్థాయిలో పోలవరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల ధరలు హెచ్చు తగ్గులో వచ్చినప్పుడు ఆదుకునే నిమిత్తం ధరల స్థిరీకరణ నిధి కేటాయించి ఆదుకోవాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ : రజకుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రజక వృత్తిదాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య కోరారు. విజయవాడరూరల్ పరిధిలోని పి. నైనవరం లో కోటేశ్వరరావు ఇంటి వద్ద శుక్రవారం సట్టు రాము అధ్యక్షతన రజకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయిన నేటికీ కూడా గ్రామీణ ప్రాంతాల్లో రజకుల స్థితిగతుల్లో పెద్ద మార్పేమి రాలేదని అన్నారు. రజకుల పట్ల కుల వివక్షత ఒక భూతంలాగా పట్టిపీడిస్తూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వత్తిదారులకు మేనిఫెస్టోలో పెట్టినటువంటి అంశాల్ని పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. రజకుల భద్రతకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ లాగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రజక కార్పొరేషన్ ద్వారా వత్తిదారులకు 90 శాతం సబ్సిడీతో అధునాతనమైన వత్తి పరికరాలు అందజేయా అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కళ్యాణ్ మాట్లాడుతూ రజకుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం వారికి అండగా ఉంటుందన్నారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సట్టు రాము, ఉపాధ్యక్షులుగా ముదిగొండ రవి, చితిరాల లక్ష్మి, కార్యదర్శిగా చితిరాల శివ, సహాయ కార్యదర్శులుగా సట్టు శివకుమారి, యడవల్లి జానకి రాములు, కోశాధికారిగా ముదిగొండ వెంకటేశ్వర్లు, ఏడు మంది ఆఫీస్ బేరర్స్ ను మరో 10 మంది కమిటీ సభ్యులతో మొత్తం 17 మందితో ఏకగ్రీవంగా కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు,సట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాస్కరయ్య

సమాజం పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రేపటి ఉజ్వల భవిష్యత్తుకు నేడే తగు ప్రణాళికలను రచించుకొని నేటి యువత సమాజం, పర్యావరణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్విరాన్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి బ్రహ్మాజీ అన్నారు. స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మూడవరోజు ఇండక్షన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మాతభాష ఔన్నత్యం, గొప్పతనంపై విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ఎంవిజి ఆంజనేయులు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా అరుణ కుమార్ అతిథులను జ్ఞాపకతో గౌరవంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ ఎం ఆర్ సి హెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి రవీంద్రబాబు, కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎల్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ ఎస్ సురేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని కమ్యూనిటీ హాల్‌లో చిన్నఆవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ సూపర్ స్పెషాలిటీ వారిచే బి.పి, షుగర్, కీళ్ళవ్యాధులు, కంటి వ్యాధులకు సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది గ్రామస్తులకు అవసరమైన రక్తపోటు, షుగర్ వ్యాధులు, కంటి కీళ్ళ వ్యాధులకు, గుండె వ్యాధులకు సంబంధించి 'ఈ.సీ.జీ' పరీక్షలు నిర్వహించి అవసరమైన పేషెంట్లకు పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తదుపరి పరీక్షల కోసం సిఫారసు చేశారు. ఈ శిబిరంలో రంగన్నగూడెం గ్రామ సర్పంచి కసుకుర్తి రంగామణి, గ్రామ ప్రముఖులు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణరావు, గ్రామ ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారి చదును

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరావు తన సొంత ఖర్చులతో మెరకనపల్లి డ్రైనేజీ మరమ్మతులు చేపట్టడమే కాక జంగిల్ క్లియరెన్స్ పనులు సొంత నిధులతో చేయించారు. మేళ్లమర్రు గ్రామంలో రోడ్డుకు ఇరుపక్కల జంగిల్ క్లియరెన్స్ గుంతల రోడ్లు చదును చేశారు. పూర్తిగా ప్రభుత్వం పైనే ఆధారపడకుండా దాతల సహాయం తీసుకుని గ్రామాలను అబివృద్ధి చేసుకోవాలని ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు అంబటి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు

సైకిల్‌పై రాజధానికి యాత్ర



ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిన సందర్భంగా కోడూరు గ్రామానికి చెందిన టిడిపి నేత ధూళిపూడి మునేశ్వరరావు వైకుంఠపు రంకు సైకిల్‌పై బయలుదేరి వెళ్లారు. శుక్రవారం కోడూరు మండల కూటమినేతల ఆధ్వర్యంలో కోడూరు గంగానమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరచాలని నారాలోకేష్ , మండలి బుద్ధ ప్రసాద్, గెలవాలని గతంలో వైకుంఠపురంలో మొక్కుకున్నట్లు, ఆ మొక్కును నేడు తీర్చేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ముందుగా మంగళగిరి టిడిపి కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి వైకుంటపురం వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి మొక్కు తీర్చుకుంటున్నట్లు మునేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖర రావు ,ఉల్లి శేషగిరి, పిల్లి మల్లికార్జున రావు ,వడుగు నాగబాబు, కడవకొల్లు శ్రీనివాసరావు ,బచ్చు వెంకటేష్ పూత పోయిన శ్రీనివాసరావు, మేడా శివాజీ, దావు మళ్లీ, వేములపల్లి శ్రీకష్ణ బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌తో జీవితం నాశనం

వెస్ట్ జోన్ ఎసిపి మురళీ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దగ్గరైతే జీవితం నాశనమవుతుందని విజయవాడ వెస్ట్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ పీ మురళీకష్ణారెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల నివారణ, సైబర్‌క్రైమ్ అంశాలపై అవగాహనా సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మురళీకృష్ణరెడ్డి మాట్లాడుతూ మత్తు కలిగించే ఏ పద్దార్థాన్ని కూడా రుచి చూడాలని భావించొద్దని, ఒకసారి దానికి అలవాటు పడితే జీవితాంతం దానిని వదలలేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. యువత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన ఉపాధిని పొందాలన్నారు. సిటీ సైబర్‌క్రైమ్ సిఐ పి.శ్రీను మాట్లాడుతూ ఇటీవల సైబర్ క్రైమ్‌కు సంబంధించిన నేరాలు అధికమవుతున్నాయన్నారు. సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నప్పటికీ అత్యాశ లేదా నిర్లక్ష్యం వలన ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత ఉన్న దేశం భారతదేశమని చెప్పారు. యువత ఏమాత్రం తప్పటడుగులు వేసి మత్తుకు అలవాటు పడితే దేశాభ్యున్నతి సైతం కుంటుపడుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో కొత్తపేట సీఐ టీ గణేష్, సైబర్‌క్రైమ్ ఎస్ఐ సిహెచ్ ఆర్కే మూర్తి, కొత్తపేట ఎస్ఐ నరేంద్ర ప్రసంగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో లు డీ పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, కల్మాబేగం పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి - మైలవరం : కర్నూలు జిల్లాలో ముగ్గురు మైనర్లు చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి ఆ చిన్నారిని చంపిన ఘటన మరువకముందే మరోఆరేళ్ల చిన్నారిపై ఒకరు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ జి.కొండూరు మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జి.కొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి. కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన నానాది శ్రీనివాసరావు (49) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాసరావు ప్రవర్తన నచ్చని భార్య తన ఇద్దరు కుమారులను తీసుకొని ఇటీవల కాలంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈనెల 24వ తేదీన మధ్యాహ్న సమయంలో తన ఇంటి వెనుక నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన ఆరేళ్ల వయస్సున్న చిన్నారిని నేరేడు కాయలు ఇస్తానని ఆశ చూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడు. తప్పించుకున్న చిన్నారి తన ఇంటికి వెళ్ళింది. అయితే గురువారం సాయంత్రం తన ఇంటికి వెళ్తున్న శ్రీనివాసరావును చూసిన బాధిత చిన్నారి గట్టిగా ఏడవటం ప్రారంభించింది. తల్లిదండ్రులు బుజ్జగించి అడగడంతో జరిగిన విషయం తల్లిదండ్రులకు చిన్నారి చెప్పింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శ్రీనివాసరావుకు దేహశుద్ధి చేశారు. అనంతరం జి.కొండూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ లావాదేవీల్లో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఐపిఎస్ వారి ఆదేశాల మేరకు, ఎన్టీఆర్ జిల్లా రూరల్ ఇన్‌ఛార్జి డిసిపి హరికృష్ణ వారి సూచనల మేరకు మైలవరం సర్కిల్, రెడ్డిగూడెం మండలం, నాగులూరు గ్రామంలో మైలవరం ఎసిపి ఎస్.మురళీమోహన్ వారి నేతృత్వంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ బాబు, స్టేషన్ ఎస్ఐ గోవిందు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆన్లైన్లో లావాదేవీలు జరిపేటప్పుడు గానీ ఏదైనా ప్రభుత్వ స్కీములు ప్రైవేటు స్కీములు వంటివి లావాదేవీలు జరిపేటప్పుడు జాగ్రత్తలు వహించి ఓటీపీలు చెప్పడం గానీ మన అకౌంటు వివరాలు చెప్పడం గానీ చేయకూడదన్నారు. లోన్ యాప్‌ల పేరిట జరిగే మోసాలు, ప్రజలందరూ ఆన్లైన్లో యాప్‌ల ద్వారా లోన్లు తీసుకోవద్దని తద్వారా వారి వ్యక్తిగత సమాచారం, ఫోన్‌లో ఉన్న కుటుంబ సభ్యుల వ్యక్తిగత ఫొటోలు సదరు సైబర్ నేరగాళ్లకు చేరతాయని దీంతోవారు వేధింపులకు పాల్పడతారని అన్నారు.

అక్టోబర్ 19 ఆకాష్ టాలెంట్ టెస్ట్

- ప్రతిభ కనబరిచినవారికి 100 శాతం స్కాలర్‌షిప్పులు, నగదు బహుమతులు - ఆకాష్ అకాడమీ డైరెక్టర్ నరేష్ వెల్లడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్(ఏఎన్‌టీహెచ్‌ఈ)–2024ను అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆకాష్ అకాడమీ డ్కెరెక్టర్ సిహెచ్ నరేష్ తెలిపారు. బెంజ్ సర్కిల్ వద్ద గల ఆకాశ్ అకాడమీలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌ల్కెన్ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆఫ్‌లైన్‌లో అక్టోబర్ 20, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా 315 సెంటర్లలో నిర్వహిస్తామని, ఆన్‌ల్కెన్‌లో అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు పరీక్షను విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న ప్రాంతం నుంచే పరీక్ష రాసేందుకు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఏడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయవచ్చని చెప్పారు. ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్‌ఎల్) 15 ఏళ్ళుగా ఎఎన్‌టిహెచ్ఇని నిర్వహిస్తుందని తెలిపారు. గత ఏడాది పరీక్షకు రికార్డు స్థాయిలో 11.8లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ ఏడాది ఏఎన్‌టీహెచ్‌ఈలో ప్రతిభ కనబరిచిన 7 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల్లో 100 మందికి, 11 నుంచి 12వ తరగతి వరకు 50 మంది విద్యార్థులకు నీట్, జేఈఈ, ఐఐటీ వంటి ఎక్కువగా పోటీ ఉండే ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలకు 100శాతం స్కాలర్‌షిప్‌తో అవసరమైన శిక్షణ ఇస్తామని, నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏఎన్‌టీహెచ్‌ఈని ప్రారంభించి 15ఏళ్ళు అయిన సందర్భంగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచినవారిని ఆకాష్ అకాడమీ సొంత ఖర్చులతో అమెరికాలోని నాసా అనుబంధ సంస్థ జాన్ ఎఫ్ కెనడీ స్పేస్ సెంటర్ సందర్శనకు పంపిస్తామని చెప్పారు. గత ఏడాది ఈ విధంగా శిక్షణ పొందిన విద్యార్థులు నీట్, జేఈఈ, ఐఐటీ వంటి అత్యంత తీవ్ర పోటీ ఉన్న పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ ఏడాది టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష రాసేందుకు రూ.200 ఎంట్రీ ఫీజు, ఆగస్టు లోపు స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి రూ.100 మాత్రమే అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చెసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆకాష్ అకాడమీ ఆపరేషన్స్ హెడ్ అర్జున్ వడ్డే, ఏరియా బిజినెస్ హెడ్ రవికిరణ్ బ్రాంచ్ హెడ్ శేషుదాసు పాల్గొన్నారు.

సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చండి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, తిరువూరు డివిజన్ పరిధిలో కొరత ఉన్న సబ్జెక్టు టీచర్ పోస్టులు భర్తీ చేయాలని యుటిఎఫ్ నాయకులు నందిగామ డివైఇఓ కి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నందిగామ డివిజన్ లో పలు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నందిగామ జిల్లా పరిషత్ హై స్కూల్లో జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా శాఖ పలు సమస్యలను నందిగామ డివైఇఓ ఎం.వెంకటప్పయ్య దృష్టికి తీసుకువచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ నందిగామ తిరువూరు డివిజన్ పరిధిలో చాలా హైస్కూల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని, సబ్జెక్ట్ టీచర్లను భర్తీ చేయుటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మల్కాపురం, గండ్రాయి, వెలది కొత్తపాలెం, హైస్కూల్, జి.కొండూరు హైస్కూల్, లక్ష్మీపురం కొనకంచి అనిగండ్ల పాడు తదితర పాఠశాల్లో ఉన్న ఖాళీలు సబ్జెక్ట్ టీచర్ ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. జగ్గయ్యపేట మండలం జడ్పీ.హెచ్.ఎస్ మల్కాపురం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, మ్యాథ్స్ , పి.యస్, ఎన్. ఎస్, సోషల్, పి.ఈ.టి.తదితర 6 పోస్టు ఖాళీగా ఉండటం వలన విద్యార్థులుకు పాఠ్య బోధన పాఠ్య బోధన తీవ్ర ఆటంకం కలుగుతుందని తెలిపారు. గండ్రాయిలో పలు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. చందర్లపాడు, పెనుగంచిప్రోలు, పాఠశాలల్లో పోస్టులు ఖాళీలున్నాయన్నారు. సబ్జెక్టు టీచర్, పిఇటి పోస్టులు ఖాళీలున్నాయని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు డి.హరి ప్రసాద్, బి.రమణయ్య, మండలం అధ్యక్షులు ఎం.వి.ఎస్ ఎన్.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



డివైఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ గాంధీ సెంటర్‌లో నందిగామ డివిజన్ ఎసిపి రవి కిరణ్ ఆదేశాల మేరకు సిఐ హనీష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనములను నడుపుతున్న మైనర్లను గుర్తించి సిఐ హనీష్ వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగితే కలిగే నష్టాలను గూరించి వారికి వివరించి మొదటి తప్పుగా జరిమానా విధించారు. ముగ్గురిని ఎక్కించుకుని ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న వారికి కూడా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దుర్గా మహేశ్వరరావు, పండుదొర, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ హనీష్

పిల్లల భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలపై ప్రచారం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పిల్లల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా, ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అవసరమయ్యే ప్రణాళికలు తల్లిదండ్రులకు వివరించేందుకు ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ విశాల్ సబర్వాల్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. తాజా ప్రచార కార్యక్రమంతో హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ తన బ్రాండ్ ఉనికిని విస్తరించడానికి దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళ నాడు, తెలంగాణలకు మరింత ప్రగాఢంగా చేరుకోవడానికి ప్రయత్నిస్తోందని హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ స్ట్రాటజీ గ్రూప్ హెడ్ విశాల్ సుబర్వాల్ తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్‌లలో వృద్ధిని కొనసాగిస్తూ, బలమైన పంపిణీ, కొత్త శాఖలతో ప్రాంతాలకు లోతుగా విస్తరిస్తున్నామన్నారు.



నకిలీ విలేకరులకు జైలు

ప్రజాశక్తి - తిరువూరు : విలేకర్లమంటూ రాత్రి వేళలో బెదిరించి అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులకు తిరువూరు కోర్టు 14 రోజుకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన వంగూరి చంద్రయ్య ఈ నెల 25 రాత్రి రైస్‌లోడ్‌తో ఆటోలో విజయవాడ వెళ్తుండగా తిరువూరు జైభావి సెంటర్‌లో కొత్తపల్లి వెంకట్, కార్తీక్, నల్లగొర్ల జమలయ్య, పొదిలి శ్రీనివాసరావులు అతన్ని అడ్డగించి, తాము విలేకర్లమని డబ్బులు ఇవ్వాలని బెదించారు. దీనితో చంద్రయ్యకు అనుమానం వచ్చి 100కు ఫోన్ చేయటంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ తీసుకొచ్చినట్లు ఎస్ ఐ చెప్పారు. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదుచేసి శుక్రవారం తిరువూరులో కోర్టులో హాజరు పర్చగా న్యాయ మూర్తి వారికి ఆగస్టు 8వ తేదీ వరకు రిమాండ్ విధించగా నూజివీడు సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేయింగ్ బిల్లుల చెల్లింపులు నిలుపుదల చేస్తూ తీర్మానం

అన్ని అంశాలూ ఆమోదం : అరకొరగానే చర్చ...

ప్రజాశక్తి - విజయవాడ : ఆటోనగర్‌కు చెందిన వేయింగ్ బ్రిడ్జీ కాంట్రాక్ట్ (మహావీర్ వెయిట్ బ్రిడ్జి) వారికి జనరల్ ఫండ్ నుంచి చెల్లించాల్సిన రూ.28.80 లక్షల బిల్లు అంశం వాయిదా పడింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం సాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొని అజెండాలోని 20 అంశాలపై చర్చించి, ఒకటి, అర అంశం మినహా మిగిలిన అన్ని అంశాలను ఆమోదిస్తూ స్టాండింగ్ కమిటీ నిర్ణయం చేసింది. సర్కిల్–3 పరిధిలో విఎంసి సేకరించిన చెత్త బరువు తూకం వేయడానికి వేయింగ్ బ్రిడ్జీ లేనందున, ఆటోనగర్‌కు చెందిన మహావీర్ వెయిట్ బ్రిడ్జిపై టన్నుకు రూ. 27 చొప్పున 2022 జులై 25 నుంచి రెండు సంవత్సరాల పాటు చెత్త బరువు నిర్ధారణ చేసినందుకు నెలకు రూ.1.20 లక్షల చొప్పున రూ. 28.80 లక్షల మొత్తాన్ని జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని ఆఫీసు వారు తీసుకున్న నిర్ణయాన్ని ర్యాటిఫై చేయాలని స్థాయి సంఘం దృష్టికి తీసుకొచ్చిన అంశాన్ని వాయిదా వేస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. కాకరపర్తి భావన్నారాయణ కమర్షియల్ (కెబియన్. కమర్షియల్ కాంప్లెక్స్)2వ అంతస్తులోని 25 షాపులు మూడు సంవత్సరాల కాలానికి లీజుకు కేటాయింపు అంశాన్ని సమావేశం ఆమోదించింది. గాంధీపార్కు ఎదురు (ఫోర్ వీలర్స్) పార్కింగ్ ప్రదేశం, ఎస్‌బిఐ వెనుక పార్కింగ్ ప్రదేశంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే కాంట్రాక్ట్‌ను ఏడాది పాటు లీజుకిచ్చే అంశం ఆమోదం పొందింది. బహిరంగ వేలంలో రూ.44.20 లక్షలు ఆఫర్ చేసిన సత్యాల చంద్రప్రసాద్‌కు ఏడాది పాటు లీజుకు కేటాయిస్తూ సమావేశం ఆమోదించింది. కాళేశ్వరరావు జనరల్ మార్కెట్ సెల్లార్, గద్ద బొమ్మ, వస్త్రలత వెనుక క్యాంటిన్ రోడ్డు పార్కింగ్ ప్రదేశంలో ఏడాది పాటు పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు రూ.44.50 లక్షలు హెచ్చు మొత్తం ఆఫర్ చేసిన కనగాల అశోక్ కుమార్‌కు కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జనవరి 25 నుంచి ఈ నెల 23 వరకు వర్క్స్ డివిజన్–2 ఇంజినీరింగ్ విభాగం రూ.ఐదు లక్షలకు లోబడిన వర్క్స్ నామినేషన్ పద్ధతిపై చేపట్టిన 210 పనులకు సంబంధించిన అంశంపై ర్యాటిఫై చేస్తూ తీర్మానించారు. నగరపాలక సంస్థలో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పిఆర్‌ఒ)గా కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న రజియా షబీనా ఉద్యోగ కాలం మరో ఆరు మాసాలు పొడిగిస్తూ సమావేశం నిర్ణయం చేసింది. ఈ నెల 24 నుంచి వచ్చే ఏడాది జనవరి 23 వరకు ఇప్పటి వరకు ఇస్తున్నట్లుగానే నెలకు రూ. 40 వేలు వేతనం చెల్లించాలని సమావేశం తీర్మానించింది. నగరంలోని పలు శానిటరీ డివిజన్లలో మృతిచెందిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించేందుకు సమావేశం తీర్మానించింది. నగరపాలక సంస్థలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న యు సురేష్‌కుమార్‌కు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీసుపై ఉద్యోగోన్నతి కల్పిస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులు బాపతి కోటిరెడ్డి, మహమ్మద్ ఇర్ఫాన్, వల్లూరి ఎన్‌డిఎస్ సత్యనారాయణమూర్తి, భీమిశెట్టి ప్రవల్లిక, అంబడిపూడి నిర్మల కుమారి, ఇసరపు దేవి, విఎంసి అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ మహేష్, సెక్రటరీ కె వసంతలక్ష్మీ, సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్ఇ (వర్క్స్) నరసింహమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు